ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

ఆదివారం 19 అక్టోబరు 2025 | 7



బంగాళాఖాతంలో అల్పపీడనంతో అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

అమలాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం కారణంగా మత్స్యకారులు సముద్రంలో ఈనెల 21వ తేదీ నుంచి చేపల వేటకు వెళ్లవద్దని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా పయనించి రాబోయే 36 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. చాలాచోట్ల తేలికపాటి నుంచి భారీ, అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆగ్నేయ మధ్య అరేబియా సముద్రం, లక్ష్యద్వీప్ ప్రాంతం, కర్ణాటక, కేరళను ఆనుకుని ఉన్న దక్షిణ తమిళనాడు తీరాల వెంబడి అక్టోబరు 19 సాయంత్రం వరకు గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల నుంచి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఈ అల్పపీడనం మరింత పెరిగి అక్టోబరు 21కి దక్షిణ అరేబియా సముద్ర మధ్య భాగాల్లో నైరుతి పశ్చిమ మధ్య అరేబియా సముద్రంలో తీరం దాటే అవకాశం ఉందన్నారు. దీని దృష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని,ప్రజలు అప్రతమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు.

చెయ్యేరు హైస్కూల్ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం

8

శేష శైల వాసా.. శ్రీ వెంకటేశా!





శేష శైలా వాస శ్రీ వెంకటేశా.. నిదురించు మా అయ్య శ్రీ చిద్విలాస.. శ్రీదేవి వంకకు చిలిపిగా చూడకు.. అలమేలు మంగకు అలకరానీయకు.. అంటూ అర్చకులు స్వామికి శనివారం రాత్రి పవళింపు సేవ చేశారు.. వాడపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగింపును పురస్కరించుకుని భక్తజనంతో ఆలయం కిటకిటలాడింది. తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. స్వామిని మనసారా చూసి.. ఆపదమొక్కులవాడా.. అనాథరక్షక గోవిందా.. గోవింద అంటూ వేడుకున్నారు.. మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

8

ఆదివారం ప్రత్యేకం

వెలుగుల చంద్రుడు!



- (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

వెలుగు..జిలుగులే

సర్కారు ఏం చేయగలదు?
అధికారంతో ఏదైనా చేయగలదు..
అభివృద్ధి చేయగలదు..
అరాచకమూ సృష్టించగలదు..
గత ఐదేళ్లు జనం అరాచకం చూశారు..
భరించలేక ఓటుతో తరిమికొట్టారు...
ప్రభుత్వాన్నే మార్చేశారు..
ఇప్పుడేం చూస్తున్నారు?
హామీల అమలు చూస్తున్నారు..
అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారు..
గూగుల్ రాకతో మన గతి
సూపర్ అంటూ ఆనందపడుతున్నారు..
చీకట్లు తరిమికొట్టే చంద్రన్న పాలనలో
ఆనంద దీపావళికి సన్నద్ధమవుతున్నారు..

దీపావళి.. చెడుపై విజయానికి సూచిక.. చీకట్లు తొలగించి వెలుగులు అందించే పండగ.. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనతో చీకట్లు కమ్ముకున్నాయి.. కూటమి ప్రభుత్వంలో ఎన్నో కొత్త వెలుగులు వచ్చాయి. పింఛన్ల పెంపు నుంచి ఉచిత గ్యాస్, ఫ్రీబస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆటో డ్రైవర్ల సేవలో, విద్యుత్ బిల్లుల తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజల జేబుల్లో కాసులు గలగలలాడుతున్నాయి. అటు కొత్తరేషన్ కార్డులు, పాస్ పుస్తకాల జారీ. గుంతల్లేని రహదారులు, ఇటు అభివృద్ధి, అటు పెట్టుబడుల వెల్లువతో జిల్లా ముఖచిత్రం మళ్లీ మారుతోంది. మూతపడ్డ అన్న క్యాంటీన్లను మళ్లీ తెరిపించి రూ.5కే పేదలు కడుపునిండా భోజనం చేసేలా చేస్తోంది. డీఎస్సీ పోస్టుల మొదలు మళ్లీ వచ్చే ఏడాది ఇంకో డీఎస్సీ, అటు పోలీస్, అటవీశాఖల్లో పోస్టుల భర్తీతో నిరుద్యోగుల మోము మతాబుల్లా వెలుగుతోంది.

- అరాచకపు చీకట్లు తొలగాయ్
- అభివృద్ధి వెలుగులొస్తున్నాయ్
- సంక్షేమంతో మంచి రోజులు
- సూపర్ సిక్స్ పథకాలతో వెలుగు
- పోస్టుల భర్తీతో నిరుద్యోగుల సంతోషం
- రేపే దీపావళి

నాడు కష్టాలు.. నేడు వెలుగులు

- **పింఛన్ల ధమాకా :** ప్రభుత్వం మారింది.. ప్రజల దశ మారింది. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చంద్రబాబు రూ.3 వేల పింఛన్ రూ.4 వేలు, అనారోగ్య బాధితులకు రూ.15 వేల చొప్పున పెంచి ఒకటో తేదీనే అందజేస్తున్నారు. కాకినాడ జిల్లాలో 2,72,107 మందికి రూ.117 కోట్లు, కోనసీమలో 2,36,705 మందికి రూ.101 కోట్లు, తూర్పులో 2,35,502 మందికి రూ.103 కోట్లు అందుతున్నాయి. ఉద్యోగులకు ఒకటినే జీతాలిస్తున్నారు.
- **తల్లికి వందనం :** ఇచ్చిన హామీ మేరకే ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లివందనం డబ్బులు పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో 5,88,378 మంది విద్యార్థులకుగాను 3,85,601మంది తల్లులఖాతాల్లో రూ.764 కోట్లు జమైంది.
- **ఉచిత గ్యాస్ :** ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ అమలవుతోంది. ఉమ్మడి జిల్లాలో 13 లక్షలగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తొలి ఉచిత సిలిండర్ 11.52 లక్షల మంది వినియోగించుకోగా రూ.95 కోట్లు జమచేసింది.
- **ఉచిత బస్సు:** ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలుచేసింది. ఉమ్మడి జిల్లాలో 25.52 లక్షల మందికిపైగా మహిళలకు లబ్ధి చేకూరుతోంది.
- **అన్నదాత సుఖీభవ:** ఈ పథకం కింద కేంద్రం ఇచ్చే రూ.2 వేలకు, రాష్ట్రప్రభుత్వం రూ.5వేలు కలిపి మొదటి విడతగా రూ.7 వేలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల మందికిపైగా రూ.300 కోట్లకుపైగా జమ చేసింది.
- **పాస్‌బుక్‌లు:** ఐదేళ్లపాటు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు ఇవ్వకుండా గత వైసీపీ తిప్పలు పెట్టింది.ప్రభుత్వం మారాక రాజముద్రతో కాకినాడ జిల్లాకు 1.47 లక్షలు, కోనసీమ 1.02 లక్షలు, తూ.గో. 95 వేలు జారీ చేశారు.
- **డీఎస్సీ సక్సెస్:** గత ఐదేళ్లపాటు ఆచూకీ లేని డీఎస్సీ పోస్టులను భర్తీ చేశారు. ఉమ్మడి జిల్లాలో 1,241 మంది నిరుద్యోగులకు ప్రభుత్వ కొలువులు దక్కాయి. వచ్చే ఏడాది మరో డీఎస్సీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.
- **ఉద్యోగులకు డీఏ :** దీపావళి కానుకగా ప్రభుత్వం ఉద్యోగులకు శనివారం ఒక డీఏ ప్రకటించింది. పోలీసులకు ఒక ఇన్‌స్టాల్‌మెంట్ ఈఎల్ ప్రకటించింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఎర్న్‌లీవ్ ఇన్‌స్టాల్‌మెంట్‌తోపాటు దీపావళికే పదోన్నతులు ఇస్తామని ప్రకటించింది.
- **జీఎస్టీ పండుగ :** ఇక కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలు లాభపడ్డారు. నిజమైన దీపావళి ఇది.

రోడ్లు వేశారు.. నరకం తప్పించారు!

వైసీపీ పాలనలో ప్రజలు రహదారులపై నరకం చూశారు. ప్రభుత్వం మారగానే సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో 900 కిలోమీటర్ల మేర అధికారులు 350కిపైగా రోడ్లను గుర్తించి రూ.70.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చారు. కాకినాడ- జొన్నాడ రహదారి రూ.225 కోట్లు, కాకినాడ -రాజమండ్రి కెనాల్ రోడ్డు రూ.160 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నారు.

పరిశ్రమలు వస్తున్నాయ్..

సీఎం చంద్రబాబు కృషితో అనేక కంపెనీలు, పర్యాటక ప్రాజెక్టులు తరలివస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన గ్రీన్ కో కంపెనీ కాకినాడలో రూ.13 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్, రూ.2,800 కోట్లతో కొత్తగా ఎలక్ట్రోలైజర్ల తయారీ ప్లాంట్‌కు ఏర్పాటు చేయనుంది. కోనసీమ, కాకినాడలో రూ.300 కోట్లు పర్యాటక పెట్టుబడులు పెట్టనున్నారు.

నాడు మైక్రోసాఫ్ట్.. నేడు గూగుల్

నేడు హైదరాబాద్ ఇలా ఉందంటే దానికి కారణం చంద్రబాబు.. ఎందుకంటే నాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను రప్పించారు.. నేడు విశాఖకు గూగుల్ రప్పిస్తున్నారు. దీంతో నిరుద్యోగుల కష్టాలు తీరనున్నాయి. కొత్త వెలుగులు రానున్నాయి.. తూర్పుగోదావరి జిల్లాలో టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేశారు. మీకో బిజినెస్ ఐడియా ఉందా.. అక్కడికి వెళితే చాలు అంతా వాళ్లే చూసుకుంటారు.



కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

స్టాకు యార్డుల్లో ఇసుక సరఫరా చేపట్టండి

డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రీచ్‌లు అన్వేషించాలి : జిల్లా కలెక్టర్

అమలాపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న అన్ని ఇసుక స్టాక్ యార్డుల నుంచి డిమాండ్‌కు అనుగుణంగా ఇసుకను సరఫరా చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. అమలాపురంలో శనివారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇసుక యార్డుల్లో విక్రయాలు, ఓపెన్ రీచ్‌లలో ఈనెల 16 నుంచి ఇసుక తవ్వకాల పునరుద్ధరణ, వశిష్ఠ, గౌతమీ నదుల్లో సెమీ మెకనైజ్డ్, పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ఉన్న అనుమతులు పెండింగ్ రీచ్‌ల అంశాలపై సమీక్షించారు. స్టాకుయార్డుల్లో ఉన్న ఇసుక నిల్వలు, ధరల వివరాలు ప్రతీరోజు భూగర్భ గనులశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేస్తూ పారదర్శకంగా ఇసుకను సరఫరా చేయాలని ఆదేశించారు. కస్టమర్‌కు రోజువారీ పరిమితి ప్రకారం సరఫరా చేయాలని సూచించారు. తద్వారా ఎక్కువ మందికి లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెరుగుతున్న ఇసుక డిమాండ్‌ను తీర్చేందుకు వీలుగా కొత్త ఇసుక రీచ్‌లను అన్వేషించాలని, ఈనెల 16 నుంచి అనుమతులు ఉన్న అన్ని రీచ్‌లలోను ఇసుక తవ్వకాలు, పునరుద్ధరణకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. రుతు పవనాల సీజన్‌లో స్టాక్ యార్డుల నుంచి సుమారు 10లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉంచగా వీటిలో 3.72 లక్షల టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయని, ఇంకా యార్డుల్లో 6,27,951 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. బల్క్ బుకింగ్ విధానం ద్వారా భారీ నిర్మాణ ప్రాజెక్టులకు ఇసుకను పొందవచ్చన్నారు. జిల్లాస్థాయి శాండ్ కమిటీ స్టాకు యార్డుల నిర్వహణ, సరఫరా, ట్రాన్స్‌పోర్టు, ధరల నియంత్రణ బాధ్యతలను కమిటీ సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఇసుక రవాణా నిరోధానికి జీపీఎస్ రెగ్యులర్ వెరిఫికేషన్ ఉండాలన్నారు. ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా భూగర్భగనుల శాఖ సహాయ సంచాలకుడు ఎల్.వంశీధర్‌రెడ్డి, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, డీపీవో శాంతలక్ష్మి, జిల్లా రవాణాధికారి పి.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ బి.రాము పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొంకాపల్లిలో సైకిల్ తొక్కుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

స్వచ్ఛాంధ్రలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకం

కొంకాపల్లిలో సైకిల్ తొక్కిన కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం స్థానిక కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛమైన గాలి ఇతివృత్త కార్యక్రమంలో భాగంగా స్కూలు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కొంకాపల్లి హైస్కూలు నుంచి ఎస్కేబీఆర్ కళాశాల వరకు సైకిల్ తొక్కుకుంటూ కలెక్టర్ మహేష్‌కుమార్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ర్యాలీలో పాల్గొన్నారు. స్వామినాయుడు తొలుత ఈ ర్యాలీని హైస్కూలు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. అధికారులు, సిబ్బంది కూడా అదే బాటలో నడిచి భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి రూపంలో వెలకట్టలేని సంపదను అందించాలని సూచించారు. చెట్లు పెంచడంతోపాటు హరిత విస్తీర్ణం వ్యాప్తిచేయడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రీన్ ఎనర్జీ చర్యలు బలోపేతం చేయడంతోపాటు సౌర విద్యుత్‌ను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఆనందరావు సూచించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లతోపాటు కోనసీమ రైతు సంఘ నాయకులు మట్టా మహలక్ష్మిప్రభాకర్ పాల్గొన్నారు.

గొల్లపుంత.. అమ్మిందెంత!



- 2009లో 128 ఎకరాల్లో 2 వేల మందికి ఇళ్ల పట్టాలు
- ఏకంగా 567 ఇళ్ల స్థలాలు క్రయవిక్రయాలు
- ఇటీవల మండపేట రెవెన్యూ అధికారుల పట్టాల సర్వే
- బాధ్యుల నుంచి లిఖితపూర్వక వివరణల సేకరణ
- బినామీ పేర్లతో పట్టాలు పొందిన వాళ్లే అధికం
- అవసరమైతే పట్టాలు రద్దు.. కొత్త పట్టాల మంజూరు
- అక్రమ కొనుగోలుదారుల గుండెల్లో రైళ్లు

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో గొల్లపుంతకాలనీ అంటే తెలియని వారుండరు. నిర్వాసితుల కోసం ఏర్పడిన అతిపెద్ద కాలనీ ఇది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆలమూరు ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి కృషి ఫలితంగా 128 ఎకరాల ప్రభుత్వ భూమిని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలుగా పట్టాలు పంపిణీ చేశారు. ఎక్కడా లేనివిధంగా ఇక్కడ ఇళ్ల స్థలాలు అందించడంతోపాటు ఇళ్లను కూడా ప్రభుత్వం కేటాయించింది. అయితే ఇక్కడ స్థలాలు పొందిన లబ్ధిదారులు మూడు వంతుల మంది ఇతరులకు విక్రయించేశారు. తర్వాత కూడా క్రయవిక్రయాలు జరిగిపోయాయి. ఇక్కడ స్థలాల విక్రయాల ద్వారా కొందరు దళారులు కోట్లకు పడగలెత్తారు. అయితే ఈ కాలనీలో ప్రస్తుతం లబ్ధిదారుదారులెందరు, స్థలం పొందిన వారు ఇల్లు నిర్మించుకున్నారా, లేదా ఇక్కడ స్థలం కొని ఇల్లు నిర్మించుకున్నాడా అనే విషయంపై ఈ ఏడాది జూలైలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 14 బృందాలు సర్వే నిర్వహించాయి. ఇక్కడ 2009 నాటికి మొత్తం 2 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా, ఏకంగా 567 మందికి చెందిన ఇళ్ల స్థలాలు చేతులు మారినట్టు తేలింది. దీంతో మండపేట రెవెన్యూ శాఖాధికారులు విక్రయాలు జరిపిన వారందరికీ ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులతోపాటు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారు, విక్రయాలు జరిపిన దళారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

రిజిస్ట్రేషన్ కాకపోయినా...

వాస్తవానికి ప్రభుత్వం అందించే ఇంటి స్థలాలను విక్రయించే వీలులేదు. ఆ స్థలాలు రిజిస్ట్రేషన్ చేయడానికి కూడా కుదరదు. అయితే ఈ ఇళ్ల స్థలాలకు సంబంధించి కొందరు లేఖర్లు విక్రయం జరిగినట్టుగా దస్తావేజులు రాసేసి కొనుగోలుదారులకు ఇచ్చేశారు. ఇక్కడ ఇంటి స్థలం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విక్రయాలు జరిగాయని తెలుస్తోంది. ఇక ఇక్కడ గృహరుణం పొందిన దానికి వేరే రేటు కూడా పెట్టి అధిక ధరలకు విక్రయించినట్టు కూడా విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం గొల్లపుంతకాలనీలో పట్టా పొంది ఇళ్లను నిర్మించుకున్న నిజమైన లబ్ధిదారులెంతమంది ఉన్నారు, ఇంటి స్థలం కొనుగోలుచేసి ఇంటి నిర్మించుకున్న వారెందరనే జాబితా సిద్ధం చేశారు. ఇప్పటికే 567 మందికి రెవెన్యూశాఖ క్రయవిక్రయాలు చేతులు మారిన వారికి నోటీసులు జారీచేశారు. దాంతో గొల్లపుంతకాలనీ వాసులంతా స్థానిక తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీంతో రెవెన్యు అధికారులు అమ్మిన వ్యక్తి, కొనుగోలుచేసిన వ్యక్తుల నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకుంటున్నారు. ఇక ఇక్కడ గృహనిర్మాణం రుణం పొందిన ఇంటిని రూ.15 లక్షల వరకు విక్రయాలు సాగించేశారని కూడా విచారణలో వెల్లడైంది. ఇక్కడ కాలనీలో బినామీల పేరిట భారీగా ఇళ్లను నిర్మించి పట్టాలు చేతులు మార్చిన వారిలో స్థానిక ప్రజాప్రతినిధులు, వారి బంధువులు కూడా ఉన్నట్టు సమాచారం. దీనిపై మండపేట మండల తహశీల్దార్ పి.తేజేశ్వరరావును వివరణ కోరగా కాలనీలో సర్వే నిర్వహించగా 567మందికి చెందిన పట్టాలు క్రయవిక్రయాలు జరిగినట్టు వెల్లడైందని చెప్పారు. వారి నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకుంటున్నామని, అర్హతను బట్టి పాతపట్టాలను రద్దుచేసి కొత్త పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మొత్తం మీద గొల్లపుంతకాలనీలో ఇళ్ల స్థలాలు విక్రయాలు కొందరిలో గుబులు పుట్టిస్తుండగా, టిడ్కో గృహాల విషయంలోనూ లబ్ధిదారుల పత్రాలను తాకట్టు పెట్టుకుని వాటిని స్వాధీనం చేసుకున్న వారిపైనా దృష్టి పెట్టాలని కొందరు విజ్ఞప్తి చేస్తున్నారు.



జనవిజ్ఞానవేదిక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు జనిపల్లి

శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన పెంచేందుకే సైన్స్ సంబరాలు

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విజ్ఞాన దృక్పథాన్ని విద్యార్థులు, ప్రజల్లో పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి, ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలను శనివారం నుంచి జిల్లావ్యాప్తంగా పాఠశాలస్థాయిలో ప్రారంభమయ్యాయి. వీటిలో భాగంగా ముమ్మిడివరం జడ్పీ పాఠశాలలో ఎగ్జామినేషన్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ బీర హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ, చెకుముకి కన్వీనర్ ఎస్.అబ్బులు శనివారం పరీక్షా పత్రాలను ఓపెన్ చేసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సైన్స్ సంబరాల బ్రోచర్‌ను జనిపల్లి సత్యనారాయణ, వీవీవీ ప్రసాద్, ఎస్.అబ్బులు, పెదపాటి నరసింహారావు, కేవీవీ సత్యనారాయణలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హను

జనవిజ్ఞాన వేదిక కార్యక్రమంలో పలువురు వక్తలు

మంతరావు మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞాన దృక్పథాన్ని ప్రజలు, విద్యార్థుల్లో పెంపొందించడానికి జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చెకుముకి పత్రిక ద్వారా విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంపొందడంతోపాటు శాస్త్రవేత్తల జీవిత విశేషాలను ఎప్పటికప్పుడు తెలియజేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో కలిపి 372 పాఠశాలలకు సంబంధించి మొత్తం 26,850మంది చెకుముకి సైన్స్ పరీక్షలు రాస్తున్నారన్నారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

కోనసీమ జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి దుర్గారావుదొర

అంబాజీపేట ఫుడ్ పాయిజన్ బాధితులకు పరామర్శ

మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.21.39 లక్షలు

8

మందు పార్టీకి పిలిచి..

పీక కోసి చంపేసి...

కాకినాడలో యువకుడి దారుణ హత్య.. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఘాతుకం

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

అనపర్తిలో వివాహిత ఆత్మహత్య

8

ముగిసిన బ్రహ్మోత్సవం


చక్రస్నాన మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు, చైర్మన్, ఈవో

- వైభవంగా స్వామివారి చక్రస్నానం
- మహాపూర్ణాహుతి, ధ్వజారోహణం
- స్వామివారి ఏకాంత సేవ
- ముగింపు ఉత్సవంలో పాల్గొన్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు




వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తజనం


నవకుంభ ఆవాహన నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

ఆత్రేయపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ స్వామివారిని దర్శించుకుని బ్రహ్మోత్సవ పూజల్లో పాల్గొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు తనయుడు సంజీవ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని మహాపూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారు వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ మేళతాళ మంగళ వాయిద్యాలతో గౌతమి గోదావరివద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామివారి చక్రస్నాన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు.


ధ్వజపతాకాన్ని తీసుకువస్తున్న చైర్మన్, ఈవో

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు, ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు, అమలాపురం డీఎస్పీ సుంకర మురళీమోహన్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో పాల్గొని తన్మయత్వం పొందారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు. రాత్రి స్వామివారి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాదాశీర్వచనం నిర్వహించి స్వామివారి అద్దాల మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామివారి ఏకాంత సేవ కనుల పండువగా నిర్వహించారు. 9 రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారుల వాయిద్యాలు, విద్యుత్, పుష్పాలంకరణ, ఫొటోషూట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి.

పోటెత్తిన భక్తజనం...

శనివారం వివిధ రాష్ట్రాల నుంచి భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. తిరుమాడవీధులలో ఏడుప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, కానుకలు సమర్పించుకుని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా రూ.62.13 లక్షల ఆదాయం లభించినట్టు ఈవో సూర్యచక్రధరరావు తెలిపారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు

స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు ఆదివారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అష్టోత్తర పూజలు, కల్యాణాలు నిర్వహించుకునే భక్తులు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేకపూజలు నిర్వహించి తూర్పు రాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించి అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

అన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఇద్దరు దాతల నుంచి రూ.2.50 లక్షలు విరాళంగా సమకూరాయి. హైదరాబాద్‌కు చెందిన కె.నారాయణశర్మ రూ.1,00,116... కాకినాడకు చెందిన కురువెల్ల విజయబాబు రూ.1.50 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. దాతల వెంట రెవెన్యూ ప్రోటోకాల్ భాస్కరప్రసాద్, టీడీపీ నాయకుడు పసుపులేటి చక్రి తదితరులున్నారు.


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత నారాయణశర్మ

మురమళ్ళ వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.21.39 లక్షలు

ఐ.పోలవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి హుండీల్లో కానుకలను లెక్కించగా 206 రోజులకు రూ.21.39 లక్షల ఆదాయం చేకూరిందని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీవీఎస్వీ ప్రసాద్, తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు సమక్షంలో శనివారం హుండీలను లెక్కించారు. ప్రధాన హుండీ ద్వారా రూ.21,05,651, అన్నదాన హుండీ ద్వారా రూ.33,490 సమకూరింది. మొత్తం ఆదాయం రూ.21,39,141గా ప్రకటించారు. దీంతో పాటు 17 గ్రాముల బంగారం, 181 గ్రాముల వెండి సమకూరింది. తొలుత అర్చకుడు పేటేటి శ్యామల కుమార్ హుండీలకు హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, సిబ్బంది మల్లిబాబు, గొలకోటి బుజ్జి, మాచరయ్యతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులు, రెవెన్యూ, పోలీసు, బ్యాంకు సిబ్బంది, సత్యసాయి సేవాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం

సామర్లకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఉండూరు ఏడీబీ రోడ్డులో లక్ష్య ఇంటర్‌నేషనల్ విద్యాసంస్థ ఆవరణలో శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ఫెన్సింగ్ క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 12వ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అండర్-14 బాలురు, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను ముఖ్య అతిథులు ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్వీ కృష్ణమోహన్, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ దీపక్‌రెడ్డి, పాఠశాల డైరక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాసు మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ఆత్మ విశ్వాసం పెరుగుతుందని, క్రమశిక్షణ జీవితంలో భాగమవుతుందన్నారు. ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండ బాబు, పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రసంగించారు.


తలపడుతున్న ఫెన్సింగ్ క్రీడాకారులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తుమ్మల బాబు

లక్ష్య ఇంటర్‌నేషనల్ స్కూల్ డైరక్టర్, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా సుగుణారెడ్డి మాట్లాడుతూ అండర్-14 విభాగంలో ఏపీలోని 13 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు విచ్చేశారన్నారు. న్యాయనిర్ణేతల సమక్షంలో అండర్ -14 కేటగిరిలో వ్యక్తిగత, జట్టు విభాగాల్లో ఫాయిల్, సబెర్, ఏపీ కేటగిరిలో పోటీలు నిర్వహించామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన న్యాయనిర్ణేతలు, కోచ్‌లు, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

సొంత ఊరికి ఆనందంగా పయనం.. అంతలోనే విషాదం

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు


మృతిచెందిన వసంత కుమార్

ప్రత్తిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న పార్సిల్ లారీని బైక్ ఢీ కొన్న దుర్ఘటనలో భర్త మృతిచెందగా భార్య తీవ్రంగా గాయ పడింది. పోలీసుల అందించిన సమాచా రం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం సమీపంలో లొట్టు కుట్టి గ్రామానికి చెందిన వసంత కుమార్, సంధ్య భార్యాభర్తలు. విజయవాడ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఓ ప్రైవేట్ కంపెనీలో భర్త వసంత కుమార్ ఉద్యోగం చేస్తూ దీపావళి సందర్భంగా మూడు రోజుల సెలవులు రావడంతో శనివారం తెల్లవారుజామున బైక్‌పై హనుమాన్ జంక్షన్ నుంచి ఇచ్ఛాపురానికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ ధర్మవరం జాతీయ రహదారిపై చేరుకుంది. ఉదయం ఐదు గంటల సమయంలో రోడ్డు పక్కన టైరు పంక్చర్ అయిన పార్సిల్ లారీ నిలిచిపోయింది. దీనిని గమనించక బైక్ వేగంగా వచ్చి లారీని ఢీకొంది. ఈ ఘటనలో వసంత కు మార్ (35) అక్క డికక్కడే మృతిచెందగా సంధ్యకు తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయింది. సంఘటనా స్థలాన్ని స్థానిక ఎస్‌ఐ ఎస్. లక్ష్మికాంతం పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్పృహ కోల్పోయిన సంధ్యను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. వసంతకుమార్, సంధ్యకు మార్చిలో వివాహం జరిగింది. పెళ్లయిన 7 నెలలకే ఈ ఘటన జరిగి వసంతకుమార్ మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరవుతున్నారు. దీపావళికి సొంత ఊరిలో ఆనందంగాగ డుపుదామనుకున్నా ఆ జంటను రోడ్డు ప్రమాదం విడదీసిందని విలపిస్తున్నారు.

'నన్నయ'లో డిసెంబరులో అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 5,6 తేదీల్లో భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో సరిహద్దులు.. వ్యవసాయ-ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో అనువర్తనాలు అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను శనివారం వీసీ ఆవిష్కరించారు. సదస్సుకు సంబంధించి నవంబరు 24వ తేదీలోపు పరిశోధనపత్రాలు సమర్పించవచ్చని ఆమె తెలిపారు.

మందు పార్టీకి పిలిచి... పీక కోసి చంపేసి...

- కాకినాడలో యువకుడి దారుణ హత్య
- ప్రేమ వ్యవహారం నేపథ్యంలో ఘాతుకం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు


మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం


శామ్యూల్ రాజు (ఫైల్)


విలపిస్తున్న శామ్యూల్ పిన్ని

కాకినాడ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిని ప్రేమ వ్యవహారం కడతేర్చింది. ఈ దారుణ హత్య శనివారం కాకినాడలో జరిగింది. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం రజకపేటకు చెందిన గంటా శామ్యూల్ రాజు (18)కి తల్లి సత్యవేణి, 9వ తరగతి చదువుతున్న చెల్లి కీర్తన ఉన్నారు. అతడి తండ్రి వీరబాబు కొంతకాలం క్రితం మృతి చెం దడంతో కుటుంబ భారం సత్యవేణిపై పడింది. ఆమె దోశ, ఇడ్లీ పిండి దుకాణాలకు వేస్తూ జీవనం సాగిస్తుంది. తల్లికి చేదోడువాదోడుగా ఉండేందుకు శామ్యూల్ రాజు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి వరకు చదివి మానేశాడు. గత కొన్నేళ్లుగా తన ఇంటి సమీపంలోని సెల్ పాయింట్‌లో పని చేస్తూ తల్లికి ఆసరాగా ఉంటున్నాడు. అయితే తనతోపాటు చదువుకున్న పాఠశాల స్నేహితుడైన స్థానిక ఎల్విన్‌పేటకు చెందిన అభివర్ధన్ అలి యాస్ అభికి శామ్యూల్ రాజుకు మధ్య గతంలో ప్రేమ వ్యవహారంలో మనస్పర్థలు వచ్చి అది కాస్తా అభి మనస్సులో కక్షగా నాటుకుపోయింది. అప్పటి నుంచి శామ్యూల్ రాజుని అంతమొందించేందుకు అభి సమయం కోసం వేచిచూస్తున్నాడు. శామ్యూల్ రాజుతో మంచిగా ఉన్నట్టే నటిస్తున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం... శుక్రవారం రాత్రి శామ్యూల్ రాజుకు ఫోన్ చేసి మందు పార్టీ చేసుకుందాం రమ్మన్నాడు. దీంతో శామ్యూల్ రాజు సెల్ పాయింట్ కట్టేసి తన స్నేహితుడు రమ్మన్న ప్రదేశం కొండయ్యపాలెం శారదమ్మ గుడి సమీపంలోని చీడీల పోర రోడ్డులోని నగరపాలక సంస్థ మేజర్ డ్రైన్ అవతల నిర్జల ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ అప్పటికే అభి తన స్నేహితుడు శ్రీనివాస్‌తో వేచి చూస్తున్నాడు. ముగ్గురు కలిసి పార్టీ చేసుకున్న అనంతరం అభి మనస్సులోని పగ వెల్లగక్కి ఇద్దరు కలిసి శామ్యూల్ రాజుపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు అభి తన కూడా తెచ్చుకున్న చాకుతో శామ్యూల్ రాజు పీక కోయడమే కాకుండా ఇంకా చావలేదని పీకకు తాడు వేసి ఆ డ్రైనేజీలో ముంచాడు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక పైకి తీసి శామ్యూల్ రాజు మృతదేహాన్ని అక్కడ వదిలేసి ఇద్దరు పరారయ్యారు. శనివారం ఉదయం అటువైపు బహిర్భూమికి వచ్చిన వారు చూసి స్థానికులను విషయాన్ని తెలియజేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడికి చేరుకున్న కుటుంబీకుల నుంచి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. సంఘటనా స్థలి వద్ద మృతుడి తల్లి సత్యవేణి, చెల్లి కీర్తన విలపించిన తీరు చూపరుల మనస్సులను కలచివేసింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు.

నమ్మించి నట్టేట ముంచి..

చిట్టీలు, అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోటికి టోకరా

పెద్దాపురం పోలీసులను ఆశ్రయించిన బాధితులు


పెద్దాపురం పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

పెద్దాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో నమ్మకంగా ఉంటూ నట్టేట ముంచేశాడు ఓ వ్యక్తి. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేట గ్రామానికి చెందిన ఎలుబండి చక్రపాణి గ్రామంలో ప్రజలతో నమ్మంగా ఉంటూ వారి దగ్గర నుంచి దశలవారీగా చిట్టీలు కట్టించుకోవడం, అధిక వడ్డీ ఇస్తానని నమ్మబలికి దఫ దఫాలుగా రూ.కోటి వరకూ సొమ్ములు లాగేశాడు. గ్రామానికి చెందిన సుమారు 80 మంది అతడి వలలో పడి డబ్బులు పోగొట్టుకున్నారు. బాధితులు తమ డబ్బులు కావాలని అడగడంతో దాటవేత ధోరణి ప్రదర్శించడంతో అనుమానం కలిగింది. దీంతో డబ్బుల కోసం చక్రపాణిని గట్టిగా ప్రశ్నించడంతో బాధితులపై ఎదురుదాడికి దిగాడు. దీంతో వారంతా స్థానిక పోలీస్‌స్టేషను ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ మౌనికను వివరణ కోరగా ప్రస్తుతానికి ఎటువంటి లిఖితపూర్వక ఫిర్యాదు అందలేదని, బాధితులు స్టేషన్‌కు వచ్చి తాము మోసపోయామన్న విషయాన్ని తెలిపారని, లిఖితపూర్వకంగా ఫిర్యాదందితే విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

కాట్రేనికోన, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు జడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడు ఎం.వెంకటేశ్వరరావు శనివారం సస్పెండ్ అయ్యారు. సహచర ఉపాధ్యాయురాలిని వేధించడమే దీనికి కారణం. తనను వెంకటేశ్వరరావు వేధిస్తున్నాడంటూ జిల్లా విద్యాశాఖాధికారికి బాధిత ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేసింది. డీఈవో షేక్ సలీంబాషా విచారణ నిమిత్తం త్రిమెన్ కమిటీని నియమించారు. త్రిమెన్ కమిటీ నివేదికను డీఈవో సలీంబాషా జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఆదేశాలతో వెంకటేశ్వరరావును సస్పెండ్ చేశారు. వెంకటేశ్వరరావుకు సహకరించిన మరో ఉపాధ్యాయుడు ఓ.జగపతిరావును పల్లం జడ్పీహైస్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపించారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

అమలాపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న ఈదరపల్లికి చెందిన నార్ని రాజా (21) అదృశ్యంపై అమలాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజా శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు.

స్కూల్ ఆటోను ఢీకొన్న కారు

ముగ్గురు చిన్నారులకు స్వల్పగాయాలు, ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు





సంఘటనా స్థలంలో వాహనాలు

రాజానగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా శనివారం సాయంత్రం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్కూలు పిల్లలతో దివాన్‌చెరువు నుంచి వస్తున్న ఆటో గైట్ కళాశాల ఎదురుగా యూటర్న్ తీసుకుని సర్వీసు రోడ్డు నుంచి చక్రద్వారబంధం వెళ్తున్న తరుణంలో ఎదురుగా వస్తున్న కారు ఆటోను బలంగా ఢీకొంది. చక్రద్వారబంధం గ్రామానికి చెందిన కొంతమంది దివాన్‌చెరువులోని సూర్యగ్లోబల్ స్కూల్లో 5,6,7 తరగతులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో గైట్ కళాశాల వద్ద సర్వీసు రోడ్డులో కారు ఢీకొనడంతో ఆటో పల్టీలు కొడుతూ బోల్తా పడింది. దీంతో ఉన్న 11 మంది పిల్లల్లో ముగ్గురికి స్వల్పగాయాలు కాగా, ఆటో డ్రైవర్ కుక్కల శ్రీనుకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను స్కూల్‌కు పంపి...

అనపర్తిలో వివాహిత ఆత్మహత్య

అత్తింటి వేధింపులే కారణమంటున్న మృతురాలి తల్లి


శిరీష (ఫైల్)

అనపర్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో శనివారం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన నమ్మి సంతోష్ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడికి ధవళేశ్వరానికి చెందిన శిరీష (30)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు అమ్మాయిలు, అబ్బాయి సంతానం. కొంతకాలంగా వారు అనపర్తిలోని సిందుట వర్స్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన తరువాత ఒక పాపను, బాబును స్కూలుకు పంపించిన శిరీష బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియ వేసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆమె ఎంతకూ పలకకపోవడంతో అత్త కృష్ణవేణి చుట్టుపక్కల వారిని పిలవగా వారు తలుపును పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సమాచారంతో ఏఎస్‌ఐ దుర్గాప్రసాద్, ట్రైనీ ఎస్‌ఐ సుజాత సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా ఉదయం జండూ బామ్ కనిపించడం లేదని అడగగా వెతుక్కోండని శిరీష సమాధానం చెప్పడంతో కొంత ఘర్షణ జరిగిందని, తాను ఇంటి నుంచి వెళ్లిపోయానని సంతోష్ చెప్తున్నాడు. అయితే మృతురాలి తల్లి లంక అమ్మాజీ మాత్రం భర్త, అత్త, ఆడపడుచు వేధింపుల వల్లే తమ కుమార్తె మరణించిందని చెప్తుంది. కుమార్తె మృతితో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారిగా మిగిలారని ఆమె రోదన చూపరులను కలచివేసింది. రెండేళ్లు కూడా నిండని శిరీష కుమార్తె ఇంటికి వచ్చిన పోలీసులను అమ్మ అమ్మ అంటూ మృతదేహం ఉన్న గదివైపు రమ్మని పిలవడం అక్కడున్న వారి హృదయాలను కలచివేసింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియాఆసుపత్రికి తరలించామన్నారు.


పోలీసుల ఒడిలో అమాయకంగా చూస్తున్న శిరీష కుమార్తె

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

కోనసీమ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి దుర్గారావుదొర


బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీహెచ్ఎంవో దుర్గారావుదొర

అంబాజీపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కల్తీ టిఫిన్ తిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర శనివారం పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. మెడ్‌యునైటెడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 13 మంది బాధితుల నుంచి డీఎంహెచ్‌వో, తహశీల్దారు చినబాబు వివరాలు సేకరించారు. డీఎంహెచ్‌వో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 15న అంబాజీపేటలోని ఓ హోటల్‌లో పలువురు టిఫిన్ తిని ఆ రోజు సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురయ్యారన్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం వారందరి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఫుడ్‌పాయిజన్‌కు సంబంధించి ఇప్పటికే వైద్య సిబ్బంది వివరాలు సేకరించడం జరిగిందన్నారు. టిఫిన్ తిన్న ఆ హోటల్‌లో సరుకుల, తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ప్రయోగశాలకు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆ హోటల్‌ను పరిశీలించారు. ఈవోపీఆర్డీ కె.శ్రీనివాస్, ఆర్‌ఐ ఏడుకొండలు,హెల్త్‌సూపర్‌వైజర్ రాధానరసింహం, వీఆర్వోలు ఉన్నారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

వైభవంగా శాంతి కల్యాణం

అంతర్వేది,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగళ్య ధారణ జరిపించారు. భక్తుల గోవిందనామాల మధ్య స్వామిఅమ్మవార్ల కల్యాణం నిర్వహించారు.

సైన్స్ సెమినార్‌లో జిల్లా ఫస్ట్ జెస్సిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న జెస్సిక

ఉప్పలగుప్తం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థిని నేతల జెస్సిక సైన్స్ సెమినార్‌లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో డీఈవో సలీంబాషా జెస్సికకు ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు. జెస్సికను పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ అభినందించారు.

దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి

మామిడికుదురు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): హరిత దీపావళిని ఆనందోత్సాహలతో జరుపుకుందామని పాశర్లపూడి హైస్కూలు హెచ్ఎం కేవీఎస్ నాగోజీరావు అన్నారు.జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సూరిమేను శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీపావళిని నిర్వహించారు. బాణసంచా తగ్గించాలని విద్యార్థులు చిత్రాలు గీసి ప్రదర్శించారు.

విద్యుత్ వినియోగదారులకు సూపర్ గిఫ్ట్



రాజోలులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్,పి.గన్నవరంలో సోలార్, జీఎస్టీ తగ్గింపు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

• ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
• సూర్యఘర్ పథకంపై అవగాహన

రాజోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 2.0లో భాగంగా రాజోలు తహశీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పునరుత్పాదకత శక్తి పరికరాలపై జీఎస్టీ తగ్గింపు, ప్రయోజనాల ప్రచార ర్యాలీలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తగ్గిన జీఎస్టీ సామాన్యులకు అందేలా చూడాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ పరికరాలపై భారీగా జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు లబ్ధి చేకూరుందన్నారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, సూరిశెట్టి శ్రీనివాస్, బందెల పద్మ, పినిశెట్టి బుజ్జి, మాలే శ్రీనివాసనగేష్, కసుకుర్తి త్రినాథస్వామి, పామర్తి రమణ, కాట్నరాజు, అడబాల చంటి, రావి మురళీ, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, రాజోలు ట్రాన్స్‌కో ఏడీఈ డీవీ కృష్ణరాజా, జేఈ మనోజ్ఞ, ఏవో ఎంపీవీ సత్యనారాయణ, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం ప్రోత్సాహం

పి.గన్నవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు ఎన్డీఏ సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరంలో విద్యుత్‌శాఖ ఏఈ ఆచార్యులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. పీఎం సూర్యగర్ పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ వేయించునే వినియోగదారులకు కరెంటు ఆదాతో పాటు జీఎస్టీ తగ్గింపుతో మరింత నగదు ఆదా అవుతుందన్నారు. తొలుత పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ త్రీరోడ్ సెంటర్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు సాగింది. కార్యక్రమంలో డీఏపీసీ కె.గంగాభవాని, జీఎస్‌టీవో సీహెచ్‌వీఆర్‌కే శాస్త్రి ఎలక్ట్రిక్ ఏఈలు జి.వెంకటేశ్వరరావు, జి.రాజేంద్ర, బి.కవిత, సర్పంచ్ బొండాడ నాగమణి, చిట్టూరి శ్రీనివాస్, దాసరి వీరవెంకటసత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మద్దాల సుబ్రహ్మణ్యం, చొల్లంగి సత్యనారాయణ మూర్తి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీను బాబు, మొల్లేటి శ్రీనివాస్, వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, కె.సత్యనారాయణ రాజు, నక్కా సత్యనారాయణ, అన్నాబత్తుల హనుమాన్, కుంపట్ల నాయుడు, కోట రాజేంద్ర ప్రసాద్, షేక్ దొరబాబు, సీహెచ్ ప్రసన్నకుమార్, ఎలక్ట్రికల్, జీఎస్టీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ రజతోత్సవం



మహిళా వాకర్స్ క్లబ్ పూర్వపు అధ్యక్షులను సన్మానించిన దృశ్యం

అమలాపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో రజతోత్సవం జరుపుకుంటున్న మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ మూడవది కాగా 103వ జిల్లాలో తొలి క్లబ్ అని వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి పేర్కొన్నారు. అమలాపురం శ్రీకళా గ్రాండ్‌లో శనివారం జరిగిన మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ రజతోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, రీజనల్ కౌన్సిలర్ బండి శ్రీనివాసరావు, ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్‌క్లబ్ తొలి అధ్యక్షురాలు కస్తూరి సత్యవాణి నుంచి 25వ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి వరకు అధ్యక్షులుగా పనిచేసిన వారినందరినీ సత్కరించారు. వీరితో పాటు మెన్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులుగా పనిచేసిన వారిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, మహిళా క్లబ్ మాజీ అధ్యక్షులు కల్వకొలను చాయాదేవి, ఉషారాణి, పుత్సా రాజేశ్వరి, రామతులసి, సత్యకుమారి, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. పుత్సా కృష్ణకామేశ్వర్ రూపొందించిన రజతోత్సవ ప్రత్యేక సంచికను ప్రభావతి విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లాలో ఉన్న క్లబ్‌ల నుంచి 150 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అల్లవరం అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాలికల భద్రత సామాజిక బాధ్యతని.. బాలికలకు చదువు ఆయుధం వంటిదని, బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం జడ్పీ హైస్కూలులో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పోషకాహారం తీసుకుని గర్భిణులు ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వాలన్నారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, కడలి వెంకటేశ్వరరావు, మట్టా ప్రభాకర్, గుబ్బల రాంప్రసాద్, పచ్చిమాల ఏడుకొండలు, దాట్ల గోపీరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి, సర్పంచ్ చిట్నీడి శ్రీదేవి, ముత్యాల బాబి, కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు సత్తిబాబు, కంకిపాటి గోపాలకృష్ణ, హెచ్ఎం ఎస్వీ రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చీరమేనుతో యానాం మార్కెట్ కళకళ



మార్కెట్‌లోకి వచ్చిన చీరమేను, కొనుగోలు చేస్తున్న దృశ్యం

యానాం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా చీరమేను అమ్మకాలు, కొనుగోళ్లతో యానాం ఫెర్రీ రోడ్డు సందడి నెలకొంది. రోజురోజుకు చీరమేను అధికసంఖ్యలో మత్స్యకారులకు చిక్కడంతో కాలసువర్షం కురిపిస్తోంది. మూడు రోజుల్లో చీరమేను ధర గణనీయంగా తగ్గింది. తొలుత శేరు రూ.600 నుంచి 800వరకు పలి కింది. శనివారం ఉదయం శేరు రూ.500కి విక్రయించారు. సాయంత్రం రూ.800నుంచి రూ.1000కు చేరింది. మరో రెండు రోజుల అధికంగా చీరమేను చిక్కనుంది. అధికసంఖ్యలో మార్కెట్‌కు చీరమేను రావడంతో రాజీవ్‌బీచ్‌లోని పుష్కర్ ఘాట్‌లో సందడి చోటుచేసుకుంది.

నిబంధనలు పాటించి బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేయాలి

దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఆర్డీవో

అమలాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆర్డీవో కె.మాధవి పేర్కొన్నారు. శనివారం ఆమె డివిజన్ ప్రజలకు ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సురక్షితంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలన్నారు. నిబంధనలు పాటించి ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులకు అవకాశం లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తహశీల్దార్లు, పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ముఖ్యంగా స్టాల్స్ సమీపంలో వాహనాల పార్కింగ్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటుచేసి నిరంతరం సూచనలుచేస్తూ వివిధ శాఖల అధికారుల సమన్వయంతో జాగ్రత్తలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. అన్ని భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు.దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలని ఆమె కోరారు.

కొనసాగిన రిలే దీక్ష

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధ రించాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరహార దీక్ష శనివారంతో 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని నీలం చినబాబు, రేవు తిరుపతిరావు, సకిలే సత్యనారాయణ, వడ్డి శ్యామ్‌ప్రసాద్, కన్నీడి వెంకటరమణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రేవు తిరుపతిరావు, టి.కొత్తపల్లి మాలమహానాడు నాయకులు ఎంవీ సూర్యం, వి.శ్యామ్‌ప్రసాద్, ఎన్.ఆనంద్, బి.సత్తిబాబు, రామకృష్ణారావు, సకిలే సూర్యనారాయణ, ఎం.సుధాకర్, వి.సత్యం సందర్శించి సంఘీభావం తెలిపారు.

సివిల్ ఇంజనీర్లు డిజైన్ కోడ్స్ అనుసరించాలి



శిక్షణలో ప్రతిభ కనబరిచిన సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులతో డాక్టర్ మాలతి

అమలాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు కాలానికి అనుగుణంగా మారుతున్న డిజైన్ కోడ్‌లను అనుసరించాలని సీనియర్ ప్రొఫెసర్, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ప్రతినిధి డాక్టర్ ఎస్.మాలతి పేర్కొన్నారు. భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సివిల్ ఇంజనీరింగ్ టెక్నికల్ అసోసియేషన్ (ట్రేస్) ఆధ్వర్యంలో అధునాతన ఇంజనీరింగ్ విధానాలపై శిక్షణ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మాలతి అనుకూలమైన పేవ్‌మెంట్ డిజైన్, ఐఆర్‌సీ37-2018 మార్గదర్శకాలు అనే అంశంపై మాట్లాడారు. సివిల్ ఇంజనీరింగ్‌లో వస్తున్న డిజైన్ కోడ్‌లను పాలో అవ్వడం ద్వారా నాణ్యమైన రోడ్లు వేయవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు మాట్లాడుతూ మారుతున్న సాఫ్ట్‌వేర్లపై అవగాహన పెంపొంచుకోవడం ద్వారా సివిల్ ఇంజనీర్లు భవిష్యత్తులో ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. బీవీసీ చైర్మన్ బోనం కృష్ణసతీష్ విద్యార్థుల నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎంసీఎస్ మధన్ మాట్లాడుతూ విద్యార్థులకు సివిల్ ఇంజనీరింగ్‌లో వస్తున్న మార్పులను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు తమ సందేహాలను డాక్టర్ మాలతిని అడిగి నివృత్తి చేసుకున్నారు.

'చెత్త సమస్యను పరిష్కరించే వరకు దీక్ష'



రిలే దీక్షలు చేస్తున్న మహిళలు

అమలాపురం రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఏడాది కాలంగా చెత్త సేకరణ నిలిపివేశారని, ప్రజారోగ్యం దృష్ట్యా చెత్త సేకరణ చేపట్టాలని డిమాండ్‌చేస్తూ బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 4వ రోజుకు చేరుకున్నాయి. 3వ వార్డు సభ్యురాలు కట్టా చండీప్రియ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. దంగేటి సరోజిని, సరెళ్ల సూర్యకుమారి, కట్టా మంగాదేవి, కోట రత్నకుమారి, కాంద్రేగుల భవానీ, జల్లి మంగాదేవి, కట్టా ఈశ్వరికుమారి, కాంద్రేగుల దుర్గ, మత్స జానీ, దొంగ భవానీ, జల్లి ప్రేమకుమారి, వీరవాసరపు విజయదుర్గ, సరెళ్ల సూర్యకాంతం, దొమ్మేటి సీత, దొంగ శ్రీలక్ష్మితో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొనగా ఎంపీటీసీ కామిశెట్టి కుసుమతో పాటు కాశిన పద్మావతి, గుమ్మిడి రాజశ్రీ, గుత్తుల మురుగులరాజు, కామిశెట్టి శ్రీను, దంగేటి రుద్ర, సరెళ్ల రామకృష్ణ, వాసా దొరబాబు, కూర్మా క్రీస్తుబాబు, చింతా ఉమామహేశ్వరరావు తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావంగా పాల్గొన్నారు.

జయరాజ్‌కు పలువురి పరామర్శ

ఉప్పలగుప్తం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పితృవియోగంతో బాధపడుతున్న వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్‌ను శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయేలు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గెడ్డం సురేష్‌బాబు, టీడీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు గొలకోటి చిన్నా, సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, జోగి రామ్మోహన్‌రాజారావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సాయం అందజేత

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం కొండుకుదురు పంచాయతీ కొండుకుదురులంకలో ఉపాధి హామీలో ఫీల్డుఅసిస్టెంట్‌గా పనిచేస్తున్న నరేష్ ఆకస్మికంగా మృతిచెందారు. ఆ కుటుంబానికి లంక గ్రామాల దళిత అభివృద్ధి సంఘాలు రూ.లక్ష అందించాయి. సంఘప్రధాన అధ్యక్షుడు గుర్రాల రాంబాబు, ఉపాధ్యక్షుడు నల్లా రాంజీఅరుణ్‌కుమార్, పోతుల హేమసుందరనారాయణరావు, జనరల్ కార్యదర్శి నక్కా శ్రీనివాస్, సెక్రటరీ గుత్తాల వరప్రసాద్, కర్రి రాంబాబు పాల్గొన్నారు.

క్లస్టర్ సమావేశం

అంతర్వేది, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండల వ్యాప్తంగా 63 ప్రాథమిక, 15 ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు అంతర్వేది, సఖినేటిపల్లి, రామేశ్వరం, మోరి క్లస్టర్లలో క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. రామేశ్వరం క్లస్టర్ సమావేశాన్ని జిల్లా సమగ్ర శిక్షాధికారి బి.సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖాధికారి డి.కిశోర్‌కుమార్ సందర్శించి ఉపాధ్యాయులకు తగు సూచనలు అందించారు. అనంతరం టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ హెచ్ఎం ఏడుకొండలు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

అమలాపురం రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో సాకుర్రులో సంతకాల కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో తొలుత గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గున్నేపల్లి అగ్రహారంలో రచ్చబండ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణ, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి-బాబు, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, మండలశాఖ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, నాయకులు సరెళ్ల రామకృష్ణ, యిళ్ల గోపి, వైస్‌ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, బొక్కా నరసింహమూర్తి, దాసరి అరుణ-డేవిడ్, కుడుపూడి సత్యనారాయణ, మురుగుల రాజు, మురుగుల నాగాబత్తుల కొండ, విప్పర్తి శ్రీను, నాగాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచండి

ఉప్పలగుప్తం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిశుద్ధమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎంపీడీవో డి.కృష్ణ సూచించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో ఆయన మొక్కలు నాటారు. వాయుకాలుష్య నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం నూకల సత్యనారాయణ, ఈవోపీఆర్డీ పెట్టా నాగేశ్వరరావు, పంచాయతీ సభ్యులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడిన చెట్టు తొలగింపు

రాజోలు,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కడలి మెయిన్ కాల్వలో భారీ వృక్షం పడి సాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ చెట్లను తొలగించే పనులను గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు పాల్గొన్నారు.

మొక్కలతో వాయు కాలుష్య నియంత్రణ

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వాయు కాలుష్య నియంత్రణ సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వాయు కాలుష్య నియంత్రణకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.చిట్టిబాబు మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలను కాల్చడంతో వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.తులసీలక్ష్మి మాట్లాడుతూ పరిశుభ్రమైన గాలి మానవాళికి ఆరోగ్యాన్నిస్తుందన్నారు. బోటనీ అధ్యాపకులు సి.సతీష్ మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలను పునర్వినియోగంతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పి.దుర్గాదేవి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల నుంచి విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు కాలుష్య నివారణపై అవగాహన కల్పించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పి.గన్నవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ బొండాడ నాగమణి పిలుపునిచ్చారు. పి.గన్నరంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీగా ప్రతిఇంటికి, షాపుల వద్దకు వెళ్లి క్లీన్‌ఎయిర్ థీమ్ వాయు కాలుష్యం, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షిద్దాం..

అయినవిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పరిరక్షిద్దాం.. పరిసరాల పరిశుభ్రతను పాటిద్దాం అంటూ పోతుకుర్రు సర్పంచ్ సయ్యపరాజు సుబ్బలక్ష్మి పిలుపునిచ్చారు. పోతకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పంచాయతీ సిబ్బంది, దీవెన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రకృతిని పరిరక్షిద్దామన్నారు. అనంతరం గ్రామ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కాలుష్యంపై పోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని దీవెన ఫౌండేషన్ చైర్మన్ గుమ్మళ్ల శ్రీనివాస్ సాగర్ పేర్కొన్నారు. మద్దెల రామకృష్ణ, పి.వెంకన్నబాబు, సీహెచ్ త్రిమూర్తులు, సీహెచ్ సత్యనారాయణమూర్తి, పంచాయతీ సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, సభ్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న పంచాయతీలు ప్రగతికి సోపానాలు

అంతర్వేది, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పట్టణ స్థాయి సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ఇటీవల సమూల మార్పులకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వంలో పంచాయతీల్లో ప్రజలకు పట్టణ తరహా సేవలు త్వరలో అమలులోకి రానున్నాయి. సఖినేటిపల్లి మండలంలో సఖినేటిపల్లి, అంతర్వేదిపాలెం, వీవీమెరక గ్రామ పంచాయతీలను ఒక్కో పంచాయతీని రెండుగా విభజనచేసేందుకు కొంత మంది వ్యతిరేకించారని, అయితే రెండు పంచాయతీల వల్ల జరిగే అభివృద్ధి గురించి వివరిస్తామని టీడీపీ ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ అన్నారు. అలాగే వీవీ మెరక గ్రామాన్ని రెండు పంచాయతీలుగా విభజించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

బాధితుల వైద్య ఖర్చులు చెల్లిస్తా: ఎమ్మెల్యే గిడ్డి



అంబాజీపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మాచవరంలో ఫుడ్‌పాయిజన్ కారణంగా అంబాజీపేట మెడ్‌యునైటెడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం పరామర్శించారు. బాధితులందరికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారందరి బిల్లులను తాను చెల్లిస్తానని ఎమ్మెల్యే ఆసుపత్రి యాజమాన్యానికి తెలిపారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, అరిగెల సూరిబాబు, గుడాల ఫణి, ఖైపాల తాతాజీ, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి గోపి, రవణం రాము, సుంకర బాలాజీ, దొమ్మేటి శ్యామ్, రామారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



పూర్వ విద్యార్థులను అభినందిస్తున్న డీవైఈవో సూర్యప్రకాశం

అమలాపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూలులో 2000-01లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన స్కానర్, ప్రింటర్, మైకు, స్పీకర్‌ను శనివారం పాఠశాల హెచ్ఎం కాశి గణసత్యనారాయణకు అందజేశారు. దాతలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, బీఎన్ వెంకటేశ్వరరావు అభినందించారు. పూర్వ విద్యార్థులు అబ్బిరెడ్డి సురేష్, ఉద్దీశ చిన్నా, బి.రవికుమార్, కస్నీడి గణేష్, నవుండ్రు రాజేష్, పోతుమూడి శ్రీనివాస్, నల్లా భూషణం తదితరులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహలతో పాఠశాలలో గడిపారు. భవిష్యత్తులో పాఠశాలకు అవసరాలను తీర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పూర్వ విద్యార్థుల తరపున అబ్బిరెడ్డి సురేష్ తెలిపారు.

విద్యను ప్రోత్సహించడమే ఉల్లాస్ పథక లక్ష్యం

మామిడికుదురు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నిరంతరం విద్యను ప్రోత్సహించడమే ఉల్లాస్ పథకం ప్రధాన లక్ష్యమని డీఆర్డీఏ ఏపీఎం విప్పర్తి వెంకటరమణ పేర్కొన్నారు. మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో శనివారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సీసీలు ఆనందబాబు, డి.నాగమణి, మహిళా సమాఖ్య ప్రతినిధులు బి.తులసీదేవి, బి.మల్లిక, రామలక్ష్మి, అక్కౌంటెంట్ నాగార్జున పాల్గొన్నారు.

తులసీరావుకు ఎంపీ హరీష్ పరామర్శ



పార్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్ తదితరులు

కాట్రేనికోన, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):ఉప్పూడి పీఏసీఎస్‌మాజీ చైర్మన్ రంభాల తులసీరావు భార్య పార్వతీదేవి ఇటీవల మృతి చెందారు. ఎంపీ గంటి హరీష్ మాధుర్, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, చెల్లి వివేకానంద, ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, చెల్లి అశోక్, ఆకాశం శ్రీనివాస్, బద్రి రమాదేవి, పితాని బాలకృష్ణ, గంటి వెంకటసుధాకర్ శనివారం తులసీరావును పరామర్శించారు. పార్వతీదేవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

వెంకన్న ఆలయంలో అన్నసమారాధన

యానాం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి బాలాలయంలో శనివారం సుంకర కార్తీక్, మద్దింశెట్టి ఏసుబాబు, గుబ్బల పరంజ్యోతి బృందం ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఏడువందల మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అర్చకులు పెద్దింటి రఘురామవినోద్, దాతలు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

అల్లవరం అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): శనిత్రయోదశి సందర్భంగా మండలంలో పురాణ ప్రసిద్ధి పొందిన ఎస్.రామేశ్వరం, లక్ష్మణేశ్వరం, గోడి, బోడసకుర్రు శివాలయాలతో పాటు పలు శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి శివాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అల్లవరం, దేవగుప్తం, గోడిలంక, బెండమూర్లంక, కొమరగిరిపట్నం, తాడికోన, యెంట్రుకోన పరిసర గ్రామాల్లోని శివాలయాల్లో శైవాభిషేకాలుజరిగాయి.

కాంగ్రెస్ సంతకాల సేకరణ

మలికిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోర్‌పై దేశ వ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణలో భాగంగా లక్కవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈసందర్భంగా పీసీసీ సభ్యుడురుద్రరాజు గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలనికోరారు.

కళాకారుల సంఘం సంతాపం

ముమ్మిడివరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరానికి చెందిన ప్రముఖ హరికథ కళాకారిణి అన్నాబత్తుల సరస్వతీశోభనాద్రి మృతి తీరని లోటని ముమ్మిడివరం శ్రీత్యాగరాయ సంగీత వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం పేర్కొంది. ముమ్మిడివరానికి చెందిన హరికథ కళాకారిణి అన్నాబత్తుల సరస్వతీశోభనాద్రి(76) ఇటీవల మృతిచెందారు. ఈసందర్భంగా సంగీత కళాకారుల సంక్షేమ సంఘం ముమ్మిడివరంలో శోభనాద్రి చిత్రపటానికి పూలమాలలువేసి మౌనంపాటించి సంతాపం తెలిపారు. త్యాగరాజ సంగీత వాయిద్య కళాకారుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

ఐ.పోలవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన వేములపల్లి మోహనరావు, శకుంతల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్వర్ణ, భైరవునేని మనోజ్ఞ 80లీటర్ల పరిమాణం గల వాటర్ కూలర్‌ను వీరేశ్వరస్వామి ఆలయానికి శనివారం బహూకరించారు. వాటర్ కూలర్‌ను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రారంభించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు

అంబాజీపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించాలని వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎం.నందకిషోర్ సూచించారు. పుల్లేటికుర్రులో రాజమహేంద్రవరం ఆచార్య ఎంజీ రంగా వ్యవసాయ విద్యాలయం రావేప్ విద్యార్థులు గ్రామీణ విశ్లేషణ కార్యక్రమాన్ని సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా రావేప్ విద్యార్థులు గ్రామ పరిస్థితులపై చిత్రపటాలను గ్రామ సరిహద్దుల, గ్రామంలోని దేవాలయాలు తదితర వాటిని రూపొందించి ప్రదర్శించారు. ఈమ్యాప్ ఆధారంగా పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ దక్షిణామూర్తి, ఏఈవో జాబేజ్‌శాస్త్రి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్లస్టర్ కాంప్లెక్స్ శిక్షణ

రాజోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సబ్జెక్టు ఉపాధ్యాయులకు, డిజిటల్ డైరెక్టర్లకు ప్రతీ నెల జరగాల్సిన కాంప్లెక్సు శిక్షణ తరగతులను శనివారం రాజోలు, కడలి, పొన్నమండ కాంప్లెక్సు కేంద్రాల్లో నిర్వహించామని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈశిక్షణ తరగతులను శిక్షణ పొందిన రిసోర్సుపర్సన్లతో నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.సరస్వతి, కాంప్లెక్సు సెక్రటరీ డి.సత్యనారాయణ, రిసోర్సు పర్సన్ జి.శ్రీనివాస్, యు.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

మలికిపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో నిర్వహించారు. విద్యార్థి చెకుముకి సైన్స్ మాసపత్రికను ఆవిష్కరించారు. ఆ పత్రిక పేరున చిన్నారుల్లో చదువు పట్ల ఆసక్తి, పోటీతత్వం పెంపొందించేందుకు సైన్స్ చెకుముకి సంబరాలు నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తారని కరస్పాండెంట్ బీవీవీ వరప్రసాద్ తెలిపారు. మొదటిస్థాయిలో పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 13ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 8,9,10వ తరగతుల విద్యార్థులు 1374మంది హాజరయ్యారు.

మాజీ ఎంపీకి శుభాకాంక్షలు

అల్లవరం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ చింతా అనురాధ జన్మదిన వేడుకలు మొగళ్లమూరిలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వైసీపీ నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస్, అబ్దుల్‌ఖాదర్, ఎంపీపీ యిళ్ల శేషారావు, జడ్పీటీసీలు కొనుకు గౌతమి, గెద్దం సంపదరావు, కొనుకు బాపూజీ, డేవిడ్, సంసాని నాని, రాయుడు విష్ణు, మట్టపర్తి నాగేంద్ర, సాధనాల వెంకట్రావు, నక్కా సంపత్, మోటూరి సత్యంకాపు, రాకాపు విజయలక్ష్మి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన జనార్దనస్వామి



ఆలమూరు నవజనార్దనస్వామిని గరుడ వాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

ఆలమూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామికి శనివారం గరుడ సేవ నిర్వహించారు. స్వామివారిని మేళతాళాలు, భక్తుల కోలాటాల మధ్య గోవింద నామస్మరణతో గరుడ వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం చేశారు. ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు అధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చకుడు ఖండవల్లి ప్రభాకరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. జనార్దనస్వామికి వాడపల్లి దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ కారుటూరి నరసింహారావు, వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు, నాయకులు వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, బొబ్బా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు శ్రీసిద్దార్థ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీసిద్దార్థ స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు

ఆలమూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు శ్రీసిద్దార్థ హైస్కూల్‌లో శనివారం ముందస్తు దీపావళిని శనివారం నిర్వహించారు. ముందుగా ఈ వేడుకలను స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ప్రారంభించి దీపావళి విశిష్టత తెలిపారు. నరకాసురుడు అనే రాక్షసుడి బారి నుంచి విముక్తి కలిగించిన సందర్భంగా దీపావళిని జరుపుకుంటారని చిన్నారులకు వక్తలు తెలిపారు. చిన్నారులు టపాసులు కాలుస్తూ సందడి చేశారు. ఆటపాటలతో వారు అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లు, దుకాణాల వద్ద వెలుగులు విరజిమ్మాలి

కమిషనర్ రంగారావు

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని ప్రజలు, వ్యాపారులు ఇళ్లు, దుకాణాల వద్ద విద్యుద్దీపాలతో పాటు మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగించాల్సిందిగా మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. రెండు రోజులపాటు ఇళ్లు, దుకాణాల వద్ద రాత్రి సమయంలో లైట్లు ఆర్పవద్దన్నారు. దీపావళి సందర్భంగా దీపకాంతులతో వెలుగులు నింపాలని పిలుపునిచ్చారు. బాణసంచా కాల్చే సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో పాటు పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రజలను కోరారు. మండపేట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో శనివారం జీఎస్టీ 2.0, స్వచ్ఛతా హీ సేవాపై జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పట్టణ మున్సిపల్ కార్యాలయంనుంచి ప్రారంభమైన ర్యాలీ పలు వీధుల్లో సాగింది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, డీఈ శ్రీనువాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, కమర్షియల్ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల

అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ అసత్య ఆరోపణలు

రావులపాలెం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు సూపర్ హిట్ అవుతుండటంతో ఓర్వ లేక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో వైసీపీ నాయకులు మద్యం వ్యాపారంలో ఉన్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల పట్టాభిరామారావు, ముత్యాల బాబ్జి, ఎం.ఆనందరావు, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్, కాసా విజయసాగర్, నందం సూరిబాబు, కొవ్వూరి అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి పదోన్నతి

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మారేడుబాక గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బూసి ప్రసాద్‌కు పదోన్నతి లభించింది. పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి రావటంతో కపిలేశ్వరపురం మండలం డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ కానున్నారు. ఆయన్ను ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో డి.శ్రీనువాసరావు, సహచర పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

ముందస్తు దీపావళి వేడుకలు

కపిలేశ్వరపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వల్లూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు టపాసులు వెలిగించి వేడుకలు జరిపారు. పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన శాలివాహన సంఘ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును శనివారం శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఈశ్వరరావు స్థానిక పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఆయన సత్కరించారు. ఆయన వెంట శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమారి, మాజీ ఎంపీటీసీ పసలపూడి శ్రీనివాసరావు తదితరులు వున్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో కొత్తపేట, పి.గన్నవరం, ఆత్రేయపురం, రావులపాలెం మండలాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ బెల్ట్‌షాపులు నడిపితే చర్యలు తప్పవన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం లొల్ల గ్రామంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో ఆయన సైకిల్ తొక్కుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను ఆయన శుభ్రం చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాయల జగన్నాథం, ముళ్ళపూడి భాస్కరరావు, పీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆర్టీసీ డిపోలో స్వచ్ఛాంధ్ర

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డిపోలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ అధ్వర్యంలో నిర్వహించారు. బస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎం సూచించారు. ఈసందర్భంగా సైకిల్ కొనుగోలు చేసి సైకిల్ తొక్కారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అచ్చుతాంబ, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రులో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా శనివారం పామర్రు జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ జరిపారు. కళాశాల నుంచి పామర్రు వీధుల్లో ర్యాలీ చేస్తూ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రశేఖర్ రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యం తగ్గిద్దాం

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): మొక్కలు పెంచి వాయు కాలుష్యం తగ్గిద్దామని ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. శనివారం కుందూరు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా విద్యార్థులకు వాయు కాలుష్యం నివారణపై అవగాహన కల్పించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు తీసుకోవల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాయకులు, విద్యార్థులు మొక్కలు పెంచుతామని, ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పంపన సత్యానందం, సొసైటీ అధ్యక్షుడు జగతా వెంకట రమణారావు, మాజీ సర్పంచ్ పంపన సుబ్బారావు, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, పళ్ల చినబాబు, గ్రామ కార్యదర్శి గౌరీ శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణతో స్వచ్ఛమైన గాలి

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతోనే స్వచ్ఛమైన గాలి సాధ్యమవుతుందని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛమైన గాలి అందరి బాధ్యత అంటూ సైకిల్ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ టీసీహెచ్ పాపారావు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, డాక్టర్ జి.శ్రీనివాసులు, కె.అంకంరావు, కె.సత్యనారాయణ, సీహెచ్ నాగారాణి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల్లో మైనర్లను పెట్టుకోవద్దు

మండపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల్లో మైనర్లను పనికి పెట్టుకుంటే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తప్పవని మండపేట ప్రాంతీయ కార్మికశాఖ అధికారి శివనాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కుమ్మరి, శాలివాహన సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్



నీలగిరిపేటలో ఈశ్వర్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కె.గంగవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కుమ్మరి, శాలివాహనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ అన్నారు. శనివారం నీలగిరిపేటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. మండల నాయకులు కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్‌లు మాచవవపు విజయకుమారి, దాలిపర్తి వేమన, మండల శాలివాహన సంఘం గౌరవాధ్యక్షుడు ఆదుర్తి గోపాలరావు, అధ్యక్షుడు ఏడిద నాగరాజు, ఉపాధ్యక్షుడు అంబటి నరేష్, కార్యదర్శి కోట సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడిద వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మందపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు



మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.12,55,195 ఒక్క రోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై శనివారం విద్యుత్‌శాఖ, మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాజగోపాల్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ రాజు, ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె.రత్నాలురావు, ఏఈ మేడిశెట్టి వెంకట రమణ, మున్సిపల్ డీఈ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రామానుజన్ జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రామానుజన్ జీవితం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. రాజమండ్రి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం రామానుజన్ గణిత గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.వీర్రాజు, ఎమ్మెస్ చక్రవర్తి, బి.భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో యువతకు మేలు

తెలుగు మహిళా అధికార రాష్ట్ర ప్రతినిధి మమత

ఆలమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైజాగ్‌కు గూగుల్ రాకతో యువతకు ఎంతో మేలు కలుగుతుందని తెలుగు మహిళా అధికార రాష్ట్ర ప్రతినిధి దండంగి మమత అన్నారు. ఆలమూరులో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గూగుల్ రావడం వల్ల యువతకు ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రానికి ఎంతో ఆదాయం వస్తుందన్నారు. రాష్ట్రానికి గూగుల్‌ను తీసుకురావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సేవలు అభినందనీయమన్నారు.

గౌడ సంఘం నిరసన

ఆత్రేయపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్ గౌడ కులస్తులను కించపరుస్తూ న్యూస్ ఛానెల్‌లో చేసిన వ్యాఖ్యలపై గౌడ కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. కులవృత్తిని కించపరుస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు తక్షణమే గౌడ కులస్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వక్తలు హెచ్చరించారు. కార్యక్రమంలో మార్గాన గంగాధర్, రంగారావు, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకన్న, సూరయ్య, కిషోర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.